'అఖండ-2' అప్పుడే మొదలు..?

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ వరుస విజయాలతో జోరుమీదున్నారు. అఖండ, వీరసింహా రెడ్డి, భగవంత్ కేసరి చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టారు. ప్రస్తుతం ఆయన బాబీ దర్శకత్వంలో తన 109వ చిత్రంలో నటిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ' ఏ స్థాయిలో విజయాన్నందుకుందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద వందకోట్ల మైలురాయిని దాటింది చిత్రం. దీంతో సీక్వెల్ ఎప్పుడు మొదలవుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం నవంబర్‌లో 'అఖండ-2' సెట్స్‌పైకి వెళ్లనుందని తెలిసింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కూడా కీలక పాత్రలో నటించనున్నారని, పాన్ ఇండియా రిలీజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయన్ని తీసుకోబోతున్నారని తెలిసింది. మొదటి భాగానికి మించిన సోషియో ఫాంటసీ, యాక్షన్, ఎమోషనల్ అంశాలతో సీక్వెల్‌ను తీర్చిదిద్దేందుకు దర్శకుడు బోయపాటి శ్రీను కసరత్తులు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ సీక్వెల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముందని సమాచారం.

క్రేజీ కాంబినేషన్ షురూ

'ఊరుపేరు భైరవకోన' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న హీరో సందీప్‌కిషన్ హీరోగా మరో క్రేజీ మూవీ మొదలుకానుంది. హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. సందీప్‌కిషన్ 30వ సినిమాగా రూపొందనున్న ఈ చిత్రానికి రాజేశ్ దండా నిర్మాత. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ బెజవాడ కథ, కథనం, మాటలు అందిస్తున్నారు. త్రినాథరావు నక్కిన, ప్రసన్నకుమార్ బెజవాడ కాంబినేషన్‌లో పలు విజయవంతమైన సినిమాలు వచ్చిన విషయం తెలిసిందే. సందీప్ ఇందులో డిఫరెంట్ కేరక్టర్‌లో కనిపించనున్నారని, అత్యున్నత సాంకేతిక విలువలతో భారీ స్థాయిలో ఈ చిత్రం రూపొందనున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బాలాజీ గుత్తా, నిర్మాణం: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్యమూవీస్.

అందుకే అతన్ని ప్రేమించా!

ప్రియుడు మథియాస్ బో గురించి తొలిసారి తన మనసులోని మాటల్ని బయటపెట్టింది అగ్ర కథానాయిక తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అయిన మథియాస్ బోతో ఈ అమ్మడు గత తొమ్మిదేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే తన లవ్‌ఎఫైర్‌పై ఈ భామ ఇప్పటివరకు ఎక్కడా స్పందించలేదు. ఈ జంట త్వరలో పెళ్లిపీటలెక్కబోతున్నారని వార్త లొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మథియాస్‌బో గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది తాప్సీ. 'మథియాస్ పరిచయం కాక ముందు నేను కొంతమంది అబ్బాయిలతో స్నేహం చేశాను. కానీ ఎవరి వ్యక్తిత్వం నన్ను ఆకట్టుకోలేదు. పురుషుల్లో నిజాయితీతో పాటు జీవితం పట్ల పరిణతి ఉండాలని క్రమంగా తెలుసుకున్నా. ఈ లక్షణాలు మథియాస్ బోలో పుష్కలంగా ఉన్నాయి. అతను నా జీవితానికి భద్రత కల్పించగలడని మా ప్రయాణంలో అర్థం చేసుకున్నా. గొప్ప వ్యక్తిత్వం కలిగిన అతనితోనే జీవితాన్ని పంచుకోవాలనే నిర్ణయానికొచ్చా' అని తాప్సీ చెప్పింది. అయితే పెళ్లి వార్తలపై స్పందించడానికి ఈ భామ నిరాకరించింది. సమయం వచ్చినప్పుడు తానే ఈ విషయాన్ని వెల్లడిస్తానని చెప్పుకొచ్చింది.

బ్యాంకాక్‌లో 'కుబేర'

ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ మల్టీస్టారర్ 'కుబేర'. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. తనదైన శైలిలో సామాజిక అంశాలను స్పృశిస్తూ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా విడుదలైన ధనుష్ ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమా తాజా షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. ఇందులో నాగార్జునతో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. టాకీతో పాటు యాక్షన్ పార్ట్‌ను తెరకెక్కించబోతున్నామని, బ్యాంకాక్‌లో ఇప్పటి వరకు ఎవరూ చూడని సరికొత్త లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుతున్నామని చిత్ర బృందం పేర్కొంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ సబ్బాని, మోనికా నిగోత్రే, దర్శకత్వం: శేఖర్ కమ్ముల.

ఈసారి మరింత నవ్విస్తాను

'నాన్నగారు తీసిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికి, ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. అది జీవితంలో సెటిల్ కాకుండానే పెళ్లి చేసుకునే వాడి కథ అయితే, ఇది సెటిల్ అయ్యాక కూడా పెళ్లికాని వాడి కథ. నా బలం కామెడీ. మంచి కంటెంట్ ఉన్న కామెడీ చిత్రమిది. ఈసారి ప్రేక్షకుల్ని మరింతగా నవ్వించాలనే ఈ సినిమా చేశా' అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తున్నది. రాజీవ్ చిలక నిర్మాత. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. జ్యోతిష్యం నేపథ్యంలో టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఫలానా తేదీలోపు పెళ్లి చేసుకోకపోతే జీవితాంతం బ్రహ్మచారిగానే మిగిలిపోతావని జ్యోతిష్కుడు హీరోతో చెప్పడం, ఈ క్రమంలో పండే వినోదం...చివరగా హీరో పెళ్లి ప్రపోజల్ పెట్టగానే హీరోయిన్ 'ఆ ఒక్కటీ అడక్కు' అని చెప్పడం నవ్వుల్ని పంచింది. ఈవీవీ సత్యనారాయణగారి టైటిల్ తీసుకున్నాం కాబట్టి ఎంతో బాధ్యతగా సినిమా తీశామని, అల్లరి నరేష్ ఈ కథను మరో స్థాయికి తీసుకెళ్లారని నిర్మాత రాజీవ్ చిలక తెలిపారు. టీజర్ మాదిరిగానే సినిమా ఆసాంతం కడుపుబ్బా నవ్విస్తుందని దర్శకుడు మల్లి అంకం పేర్కొన్నారు. వెన్నెల కిషోర్, జామీ లివర్, వైవా హర్ష, అరియానా గ్లోరీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య, సంగీతం: గోపీసుందర్, దర్శకత్వం: మల్లి అంకం.

సమాజంలో చైతన్యాన్ని కలిగిస్తుంది

సాయిరామ్‌శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వెయ్ దరువెయ్'. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మిస్తున్నారు. ఈ నెల 15న విడుదల కానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిగ్‌టికెట్‌ను పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, దర్శకుడు త్రినాథరావు నక్కిన లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ 'నేటి రాజకీయాల తీరుతెన్నులను విమర్శిస్తూ సమాజంలో చైతన్యం కలిగించే కథాంశమిది. చక్కటి సందేశంతో ఈ సినిమా తీశారు' అన్నారు. తన కెరీర్‌కు కమ్‌బ్యాక్ మూవీ అవుతుందని, కమర్షియల్ అంశాలతో పాటు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించే అంశాలుంటాయని హీరో సాయిరామ్‌శంకర్ తెలిపారు. 35 రోజుల్లో ఈ చిత్రాన్ని పూర్తి చేశామని, మూడువందలకు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నామని దర్శకనిర్మాతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

మన జీవితాలు తెరపై కనిపిస్తాయి

ఆస్ట్రేలియాలో 6లక్షల జీతం.. సౌకర్యవంతమైన జీవితం.. సినిమాకోసం ఈ రెండింటినీ వదిలేశాడు చైతన్యరావు. ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్స్ లేరు. ఎవర్ని కలవాలో తెలియదు. ఎలా వెళ్లాలో తెలియదు. కానీ తెగించి ముందడుగేశాడు. 2013లో 'బందూక్' అనే సినిమాలో వేషం సంపాదించాడు. అక్కడ్నుంచి పోరాటం చేస్తూనేవున్నాడు. ఎట్టకేలకు ఇప్పుడు బిజీ నటుడయ్యాడు. గట్టిగా అనుకుంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి 'చైతన్యరావు' ఓ ఉదాహరణ. ఆయన నటించిన 'షరతులు వర్తిస్తాయి' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయనతో 'నమస్తే తెలంగాణ' చిట్‌చాట్.

- చిన్నప్పట్నుంచీ సినిమాలంటే పిచ్చి. చిరంజీవి అభిమానిని. ఎలాగైనా హీరో కావాలనేది లక్ష్యం. 'మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ.. కష్టపడి వచ్చావ్... కరెక్ట్ కాదు..' అని మనసు చెబుతున్నా.. రిస్క్ తీసుకుని ఉద్యోగాన్ని వదిలేసి హైదరాబాద్ చేరుకున్నాను. చేయని ప్రయత్నం లేదు. పదేళ్లపాటు ఎన్నో అవస్థలు పడ్డాను. ఎట్టకేలకు '30 వెడ్స్ 21' వెబ్‌సిరీస్ తొలి సక్సెస్‌ని ఇచ్చింది. ఆ తర్వాత వరుసగా అవకాశాలు వస్తున్నాయి.
- చిరంజీవిగారు నాకు అన్ని విషయాల్లోనూ ప్రేరణ. నటుడిగా వెంకటేశ్ యాక్టింగ్ అంటే ఇష్టం. యంగ్‌స్టర్స్‌లో తారక్, రణ్‌బీర్‌కపూర్ నా ఫేవరెట్ ఆర్టిస్టులు. నటుడిగా వీరంతా నాకు ఆదర్శమే. హీరోగా ఎదగడం కంటే మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడమే నాకిష్టం. అదృష్టం బావుండి మంచి పాత్రలే వస్తున్నాయి.
- 'షరతులు వర్తిస్తాయి' రిలేటబుల్ ఫిల్మ్. ఎవరి జీవితాలు వాళ్లు తెరపై చూస్తున్నట్టు ఉంటుందీ సినిమా. క్లీన్ మూవీ అన్నమాట. ఇందులో నా పాత్ర పేరు చిరంజీవి. మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ పర్సన్‌ని. ఇంట్లో పెద్ద కొడుకుని. కావల్సినన్ని బాధ్యతలుంటాయి. వాటికోసం శ్రమిస్తూవుంటా. ఇందులో హీరోయిన్ పేరు విజయశాంతి. డామినేటెడ్ పర్సన్. చిరంజీవి శ్రమైకజీవి. పేర్లకు తగ్గట్టే కేరక్టరైజేషన్స్ కుదిరాయి.
- సినిమా ఆద్యంతం వినోద భరితంగా ఉంటుంది. ఎమోషన్స్‌కి కొదవ ఉండదు. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది. దర్శకుడు కుమారస్వామి ఈ సబ్జెక్ట్ చెప్పినప్పుడే మంచి సినిమా అవుతుందనిపించింది. అందుకు తగ్గట్టే అందరూ మెచ్చేలా ఆయన తీర్చిదిద్దారు. చూస్తున్న ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చే సినిమా ఇది.
- నా కెరీర్‌లో మెమరబుల్ మూవీ అంటే 'కీడా కోలా'. విజయ్ దేవరకొండ, విశ్వక్‌సేన్ లాంటి హీరోలను పరిచయం చేసిన తరుణ్‌భాస్కర్.. నన్ను హీరోగా పెట్టి సినిమా తీయడం నా లైఫ్‌లో మరిచిపోలేను. పైగా బ్రహ్మానందంగారి కాంబినేషన్. ఆ సినిమా చేస్తున్నప్పుడే నేను సాధించాననే ఫీలింగ్ కలిగింది. మళ్లీ తరుణ్‌సార్‌తో కలిసి పనిచేయాలనుంది.
- 'షరతులు వర్తిస్తాయి' ఈ నెల 15న విడుదల కానుంది. ఆ తర్వాత 'పారిజాత పర్వం' అనే సినిమా చేశాను. అది కూడా త్వరలో విడుదల కానుంది. ఇంకా దేవకట్టాగారి డైరెక్షన్‌లో కూడా ఓ సినిమా చేశాను. ఇదిగాక 'కంటైనర్'(వర్కింగ్‌టైటిల్) అనే సినిమా కూడా చేశాను. ఈ సినిమా కథ 70శాతం కంటైనర్‌లోనే ఉంటుంది. ఇదొక విభిన్నమైన ప్రయోగం. అందుకే ఈ సినిమాకు నేను రెమ్యునరేషన్ కూడా తీసుకోలేను. ఇంకా మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

'విశ్వంభర'లో ద్విపాత్రాభినయం?

'పొన్నియన్ సెల్వన్' చిత్రంతో సెకండ్ ఇన్సింగ్స్‌లో విజయాల బాట పట్టింది సీనియర్ కథానాయిక త్రిష. ఇరవైఏళ్లకుపైగా కెరీర్‌లో కొనసాగుతున్న ఈ అమ్మడు ఇప్పటికీ వన్నె తరగని అందంతో అలరారుతున్నది. ప్రస్తుతం ఈ భామ చేతిలో అరడజనుకుపైగా సినిమాలున్నాయి. అవన్నీ భారీ చిత్రాలే కావడం విశేషం. ఇక తెలుగులో ఈ భామ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నది. 'స్టాలిన్' తర్వాత వీరిద్దరు మరలా జోడీ కట్టడం విశేషం. ఇటీవలే ఈ సినిమా సెట్స్‌లో త్రిష జాయిన్ అయిందని తెలిసింది. ఇదిలావుండగా ఈ సినిమాలో త్రిష పాత్ర గురించి ఆసక్తికరమైన విషయం బయటికొచ్చింది. సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా భిన్న కాల వ్యవధుల్లో సాగుతుందని, ఇందులో త్రిష ద్విపాత్రాభినయంలో కనిపించనుందని అంటున్నారు. కథా గమనంలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, తెలుగులో త్రిషకు పూర్వ వైభవం తీసుకొచ్చే పాత్ర ఇదని చెబుతున్నారు. ప్రస్తుతం త్రిష మలయాళంలో రామ్, ఐడెంటిటీచిత్రాలను చేస్తున్నది. తమిళంలో మణిరత్నం-కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.

వినూత్న కథతో 'ఫైటర్ రాజా'

రామ్జ్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రల్లో రన్‌వే ఫిల్మ్స్ సంస్థ తెరకెక్కిస్తున్న తాజా చిత్రానికి 'ఫైటర్ రాజా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కృష్ణప్రసాద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దినేష్ యాదవ్, పుష్పక్ జైన్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను యువహీరోలు శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ఆవిష్కరించారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న కథ ఇదని, యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కూడా నచ్చుతుందని దర్శకుడు కృష్ణప్రసాద్ తెలిపారు. వినూత్న కథాంశంతో యంగ్ టీమ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని నిర్మాత దినేష్ యాదవ్ పేర్కొన్నారు. తనికెళ్ల భరణి, చక్రధర్, శివనందు, రోషన్, తాగుబోతు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీధర్ కాకిలేటి, సంగీతం: సమ్రన్ సాయి, రచన-దర్శకత్వం: కృష్ణప్రసాద్.